నా రాజకీయ జీవితం మీకే అంకితం

- నన్ను మరోసారి ఆశీర్వదించండి
- మీ బిడ్డగా మరింత అభివృద్ధిచేస్తా
- ధర్మపురి ప్రజాఆశీర్వాద సభలో మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, నవంబర్ 2:'ధర్మపురి నియోజకవర్గ ప్రజలు నన్ను అనేకమార్లు ఆశీర్వదించారు. మరోసారి మీ బిడ్డగా ముందుకొచ్చాను. ఈసారి కూడా ఆశీర్వదించండి.. నా జీవితం మొత్తం ఈ నియోజవకవర్గ ప్రజలకే అంకితం చేస్తా. పేద కుటుంబంలో పుట్టిన నాకు రాజకీయ అవకాశం కేసీఆర్ ఇస్తే.. ఈ నియోజకవర్గ ప్రజలు నన్ను అంచెలంచెలుగా ఎత్తుకు ఎదిగేలా చేశారు. పేదింటి బిడ్డగా నాకు అందరి కష్టాలు తెలుసు. అన్ని వర్గాలను సమదృష్టితో చూస్తూ.. సీఎం సహకారంతో వందలాది కోట్లు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నా'నని మంత్రి, ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం ధర్మపురిలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో కొప్పుల మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు తండ్రితో సమానమని అన్నారు. నియోజకవర్గం కోసం ఏది అడిగినా కాదనకుండా ఇచ్చారని, వందల కోట్లు కేటాయించి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి సహకరించారని కొనియాడారు. గోదావరి ఒడ్డునే ఉన్నా గతంలో తాగేందుకు నీళ్లు దొరకని పరిస్థితి అని, ఇప్పుడు కేసీఆర్ కృషితో పుష్కలమైన నీళ్లు వస్తున్నాయని తెలిపారు. సాగు నీటి కోసం నాడు రైతులు అష్టకష్టాలు పడ్డారని, ఇప్పుడు లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే స్థాయికి చేరుకున్నట్టు చెప్పారు. ఈ సారి కూడా ఆశీర్వదిస్తే వందలాది కోట్లు తెచ్చి నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు సేవచేసుకునే అవకాశాన్ని మరోసారి కల్పించాలని ఆయన కోరారు.

కేసీఆర్‌తో నిర్మల్ జిల్లా కల సాకారం

- మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటైంది
- దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ 14 ఏండ్లపాటు పోరాటం చేసి తెలంగాణను సాధించడం వల్లే ఇప్పుడు అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వ హయాంలో రాష్ట్రం రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ఈ నెల 30న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ నిర్మల్‌కు వచ్చి ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రం వచ్చాక నిర్మల్ జిల్లా కేంద్రమైందని, మెడికల్ కాలేజీ వచ్చిందని అన్నారు. రూ.714 కోట్లతో దిలావర్‌పూర్ మండలంలో శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించుకున్నట్టు చెప్పారు. నిర్మల్ నియోజకవర్గంలోని 50 వేల ఎకరాలకు సాగునీరందుతున్నదని తెలిపారు. సోన్ మండలం పాక్‌పట్ల వద్ద రూ.300 కోట్లతో పామాయిల్ పరిశ్రమకు ఇటీవలే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ పరిశ్రమతో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. నిర్మల్ మున్సిపాలిటీతోపాటు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నామని తెలిపారు. అడిగిన వెంటనే నిధులిచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు.

బీఆర్ఎస్‌ది సంక్షేమ మ్యానిఫెస్టో

- కేసీఆర్ సహకారంతో మస్తు అభివృద్ధి
- నీళ్లు, కరెంటుకు ఢోకా లేదు
- బాల్కొండ అభ్యర్థి, మంత్రి వేముల

కమ్మర్‌పల్లి/వేల్పూర్, నవంబర్ 2 : బాల్కొండ నియోజకవర్గ రైతులు గతంలో నీళ్లు, కరెంటు కోసం ఎన్నో తిప్పలు పడ్డారని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ సహకారంతో ఎస్సారెస్పీ పునర్జీవం, ఎత్తిపోతల పథకాలు, వాగులపై ఎక్కడికక్కడ చెక్ డ్యాములు నిర్మించుకోవడంతోపాటు కొత్తగా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం నీళ్లు, కరెంటుకు ఏమాత్రం ఢోకా లేదని అన్నారు. గురువారం బాల్కొండలో నిర్వహించిన నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో వేముల మాట్లాడుతూ.. తొమ్మిదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో ఒకప్పుడు బోరు బావుల కింద సాగుకు, ఎత్తిపోత పథకాలకు భయంకరమైన కరెంటు తిప్పలు ఉండేవని గుర్తుచేశారు. సీఎం ఆశీర్వాదంతో రైతుల సమస్యలన్నీ తొలగిపోయాయని తెలిపారు. కొత్తగా 18 సబ్‌స్టేషన్లను నిర్మించుకొని కరెంటు కష్టాలను శాశ్వతంగా దూరం చేసుకున్నామని అన్నారు. పునర్జీవ పథకంతో నియోజకవర్గం సస్యశ్యామలమైందని చెప్పారు. వరద కాలువ, కాకతీయ కాలువ నిండు కుండల్లా ఉన్నాయని తెలిపారు. లక్ష్మి, గుత్ప, నవాబు తదితర ఎత్తిపోతల పథకాలకు ఎలాంటి ఇబ్బందులు లేవని పేర్కొన్నారు. ఎన్నో చెక్ డ్యాములు నిర్మించుకున్నామని వివరించారు. నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ సహకారంతో రూ.వెయ్యి కోట్లతో బ్రహ్మాండమైన బీటీ రోడ్లు, బ్రిడ్జీలు నిర్మించుకున్నామని, ఆలయాలు, చర్చిలు, మసీదులను పునరుద్ధరించామని చెప్పారు.

స్పీకర్ శ్రీనివాసరెడ్డికి కుల సంఘాల మద్దతు

బాన్సువాడ/కోటగిరి, నవంబర్ 2: బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి రోజు రోజుకూ ప్రజల మద్దతు పెరుగుతున్నది. కోటగిరి మండలం ఎత్తొండకు చెందిన 60 వెలమ కుటుంబాలు, బాన్సువాడ మండలం సోమేశ్వర్ గ్రామానికి చెందిన ముస్లింలు ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో స్పీకర్‌కు తీర్మాన పత్రాలు అందజేశారు. తామంతా అభివృద్ధి ప్రదాత స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వెంటే నడుస్తామని వారు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే సురేందర్‌కు జైకొట్టిన పలు గ్రామాలు

సదాశివనగర్, నవంబర్ 2: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి, లింగంపల్లి, ఉత్తునూర్, రామారెడ్డి మండలంలోని వడ్డెర కాలనీ వాసులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తీర్మాన పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ వెంటే ఉంటామని వారు ప్రకటించారు.

బీఆర్ఎస్‌లో చేరిక

రామకృష్ణాపూర్, నవంబర్ 2 : మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు శ్రీవినాయక కాలనీకి చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్ చెన్నూర్ అసెంబ్లీ అభ్యర్థి బాల్క సుమన్ సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో నల్ల మనోహర్‌రెడ్డి, కూరపాటి చంద్రశేఖర్, బండారి శంకయ్య, మల్లయ్య, సంతోష్, ఎన్నం బక్కయ్య, భీమయ్య, శివ, కార్తీక్, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అలుగుల శ్రీలత సత్తయ్య, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, పొలం సత్యం, పారిపెల్లి తిరుపతి, జాడి శ్రీనివాస్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఢిల్లీ మెడలు వంచి రిజర్వేషన్ తెచ్చుకుందాం

వాల్మీకుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

వాల్మీకుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి.

వనపర్తి, నవంబర్ 2: తెలంగాణ సాధన కోసం ఢిల్లీ మెడలు ఎలా వంచామో.. అలాగే వాల్మీకుల రిజర్వేషన్‌ను కూడా పోరాడి సాధించుకుందామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వాల్మీకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. కులాలకు రిజర్వేషన్ కల్పించే బాధ్యత కేంద్రం ఆధీనంలో ఉంటుందని, 6 శాతం ఉన్న ఎస్టీ రిజర్వేషన్‌ను 10 శాతానికి పెంచి.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం చట్ట సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే.. అక్కడి నుంచి ఎలాంటి స్పందన రాలేదని వివరించారు. మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీ జాబితాలో కలపాలన్నది న్యాయమైన డిమాండ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల నియోజకవర్గ సమన్వయ కర్త వంగూర్ ప్రమోద్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ విజయ్‌కుమార్, రీజినల్ అథారిటీ సభ్యుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలపై మాట్లాడేది కాంగ్రెస్సా?

- యువశక్తి కదం తొక్కాలి.. బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- బోధన్ అభ్యర్థి షకీల్‌కు 50 వేల మెజార్టీ ఇవ్వాలి
- మహా యువగర్జన సభలో ఎమ్మెల్సీ కవిత పిలుపు

షకీల్‌ను గెలిపించాలని మహా యువగర్జనలో కోరుతున్న ఎమ్మెల్సీ కవిత

బోధన్, నవంబర్ 2: కాంగ్రెస్‌కు ఉద్యోగాల కల్పనపై మాట్లాడే అర్హత లేదని.. చరిత్రలోనే అత్యధిక ఉద్యోగాలు కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో యువత ముందు నడిచిందని, ఎత్తిన పిడికిలి దించకుండా ఉద్యమించారని, అదే స్ఫూర్తితో ప్రస్తుత ఎన్నికల్లో యువకులు కదం తొక్కాలని, బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఎన్ఎస్ఎఫ్ గ్రౌండ్స్‌లో వేలాది మంది యువకులతో గురువారం సాయంత్రం నిర్వహించిన 'మహా యువగర్జన సభ'లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బోధన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్, ఆయన సతీమణి అయేషా ఫాతిమా ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో కవిత మాట్లాడుతూ.. బోధన్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన షకీల్ భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగాల కల్పనపై కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో మొత్తం కలిపి కేవలం 24 వేల ఉద్యోగాలు కల్పించారని, అందులో తెలంగాణకు వచ్చిన ఉద్యోగాలు 10 వేలు మాత్రమేనని చెప్పారు. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ 2.32 లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు నోటిఫికేషన్లు జారీ చేశారని, ఇందులో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీచేసుకున్నామని, మిగతా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించారు. కేసీఆర్‌ను ఓడించడం ప్రతిపక్షాలకు సాధ్యం కాదని, కేసీఆర్‌ను ఓడించాలంటే మళ్లీ కేసీఆరే పుట్టాలని కవిత అన్నారు. అనంతరం అభ్యర్థి మహ్మద్ షకీల్ మాట్లాడుతూ.. కవితక్క నాయకత్వంలో బోధన్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధిచెందిందని, కవితక్క నాయకత్వంలో జిల్లాలో బీఆర్ఎస్ అన్ని సీట్లు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పిల్లి సురేశ్ అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

కాంగ్రెస్ నాయకులు చేసిందేమిటి?

- 11 సార్లు అవకాశమిస్తే ప్రగతి శూన్యం
- కుట్రపన్ని రైతుబంధును నిలిపేశారు
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫైర్

పాలమూరు/మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, నవంబర్ 2: కాంగ్రెస్ నాయకులు 11 సార్లు అధికారం చేపట్టినా రైతులకు కనీసం రూపాయి అయినా సాయం చేశారా? అని ఎక్సైజ్ శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుబంధు ద్వారా ఇప్పటికే 11 సార్లు పంట సాయం చేశామని తెలిపారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఓబులాయపల్లితండా, ఓబులాయపల్లి, కోటకదిర గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు బాగుపడుతుంటే కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి రైతుబంధు సాయాన్ని అడ్డుకున్నదని మండిపడ్డారు. మన్యంకొండ ఆలయం వద్ద రోప్‌వే, టూరిజం హోటల్, ఏసీ కల్యాణ మండపం నిర్మిస్తున్నామని తెలిపారు. శాంతానారాయణ గౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు పుస్తెమెట్టెలు అందజేసి ఉచిత సాముహిక వివాహాలు జరిపిస్తున్నామని చెప్పారు. అవసరమైతే కన్యాదానం కూడా చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్.. మహబూబ్‌నగర్ పట్టణ బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ పిల్లి సురేశ్ అంతిమయాత్రలో పాల్గొని ఆయన పాడె మోశారు.

జనగామను ఇండస్ట్రియల్ కారిడార్ చేస్తాం

- యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తాం
- ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్ మండలం పెంబర్తిలో పల్లాకు మంగళహారతులు పడుతున్న మహిళలు

జనగామ రూరల్, నవంబర్ 2: జనగామ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మరోసారి అధికారం చేపట్టగానే తానే స్వయంగా కేసీఆర్ దృష్టికి వెళ్లి ఇందు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తానని చెప్పారు. దీంతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, ఫామ్ ఆయిల్ ఇండస్ట్రీ, నర్సింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటుకు కూడా సహకరిస్తామని చెప్పారు. ఇక్కడే అనేక పరిశ్రమలు నెలకొల్పేందుకు కృషి చేస్తానని భరోసానిచ్చారు. పెంబర్తిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గురువారం జనగామ రూరల్ మండలంలోని పెంబర్తి, ఎల్లంల, సిద్దెంకి, పెద్దరాంచర్ల, ఓబుల్ కేశ్వాపూర్, పసరమడ్ల, శామీర్‌పేట గ్రామాల్లో రైతు బంధు సమితి చైర్మన్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, ఎన్నికల జనగామ ఇన్‌చార్జి తాటికొండ రాజయ్యతో కలిసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ, బోనాలు, మంగళహారతులతో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు.

ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు

ఉమ్మడి ఖమ్మంలో అన్ని సీట్లూ మావే

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ధీమా

ఖమ్మం, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని పదికి పది సీట్లు దక్కించుకునే విధంగా తమ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 75 ఏండ్ల చరిత్రలో ఖమ్మం నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. ఖమ్మానికి మెడికల్ కాలేజీ తీసుకురావాలని గతంలో ఏ ప్రభుత్వమూ భావించలేదని ఆరోపించారు. తుమ్మల నాగేశ్వరరావు నాడు మంత్రి గా కొనసాగినప్పుడు ఖమ్మం నగరంలో నీటి ఎద్దడి ఉండేదని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతే తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటా

- చొప్పదండి కాంగ్రెస్ నాయకుడు నాగి శేఖర్

చొప్పదండి,(రామడుగు), నవంబర్ 2: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ యువ నాయకుడు నాగి శేఖర్ ఆ పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని ప్రకటించారు. గురువారం రామడుగు మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ.. తన భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. 22 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశానని, అలాంటి తనకు టికెట్ ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. స్థానికుడిగా, విద్యావంతుడిగా స్థానికంగా ఓట్లు ఎక్కువ కలిగిన సామాజిక వర్గానికి చెందిన తాను 2009, 2014, 2018 ఎన్నికల్లో టికెట్ ఆశించినా అధిష్ఠానం ఇవ్వలేదని, 2023లో కూడా మొండి చేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే రిపోర్టులు తనకు అనుకూలంగా ఉన్నాయని, తనను ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని చెప్పి ఆఖరి నిమిషంలో ఒకరిద్దరి వ్యక్తుల లాబీయింగ్ వల్ల టికెట్ వేరే వ్యక్తికి ఇచ్చారని వాపోయారు. చొప్పదండి నియోజకవర్గం ఎస్సీ అయిన తరువాత గత నాలుగు పర్యాయాలుగా మాల సామాజిక వర్గానికి టికెట్ ఇచ్చారని, ఒక్కసారి కూడా 50 వేలకు పైగా ఓట్లున్న మాదిగ వర్గానికి కాంగ్రెస్ టికెట్ ఎందుకు ఇవ్వలేదో స్పష్టమైన సమాధానం చెప్పాలని అధినాయకత్వాన్ని కోరారు. భూములు అమ్ముకొని పార్టీ కోసం పనిచేశానని, తనను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిని మార్చాలని, లేకపోతే కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటానని, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఫొటోలు పెట్టుకుని ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని మాదిగ బిడ్డలు అందరూ సమష్టిగా తనకు సహకరించాలని కోరారు.

- **సీఎం సభలో అల్లోల ఫ్యామిలీ..**

గురువారం నిర్మల్‌లో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో సాధారణ కార్యకర్తల్లా హాజరై నినదిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సతీమణి అల్లోల విజయలక్ష్మి, కోడలు దివ్యారెడ్డి.

రాహుల్‌కు కుటుంబ విలువ తెలియదు

- చనిపోయిన మూడేండ్లకు రైతు కుటుంబం గుర్తొచ్చిందా?
- రూపాయి సాయం చేయకుండా మొసలికన్నీరు : జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, నవంబర్ 2: తాడు బొంగరం లేని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి కుటుంబ విలువ ఎలా తెలుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మండిపడ్డారు. మూడేండ్ల కిందట ఓ రైతు చనిపోతే.. ఇప్పుడు ఎన్నికల ముందర గుర్తొచ్చిందా అని విమర్శించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో గురువారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. జిల్లెళ్ల గ్రామంలో మూడేండ్ల కిందట రైతు ఎగిరిశెట్టి చంద్రయ్య ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయనకు 28 గుంటల పొలం ఉండటంతో వారం రోజుల వ్యవధిలోనే రైతుబీమా కింద బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లించామని వివరించారు. మృతురాలి భార్య తిరుపతమ్మకు వితంతు పింఛన్ కూడా వస్తున్నదని చెప్పారు. చంద్రయ్య అప్పుల బాధతో చనిపోలేదని, ఆయన పొలంలో పత్తి దిగుబడి బాగానే వచ్చిందని తెలిపారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకుంటే కాంగ్రెస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం అప్పుల బాధ అంటూ కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రయ్య చనిపోయిన మూడేండ్ల తర్వాత రాహుల్‌గాంధీ వచ్చి పరామర్శించడం వెనుక అర్థమేంటని ప్రశ్నించారు. పది పైసలు కూడా సాయం చేయకుండా కేవలం మొసలి కన్నీరు కార్చి వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి నారాయణరెడ్డి అక్రమంగా సంపాదించిన డబ్బులతో బీఆర్ఎస్ నాయకులను సంతలో పశువులలాగా కొనుగోలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎవరెన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ విజయాన్ని ఏ శక్తి అడ్డుకోలేదని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో మీడియాతో మాట్లాడుతున్న నాగం. పక్కన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

సుదీర్ఘ రాజకీయ అనుభవజ్ఞుడు నాగం

- ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రశంస
- రాష్ట్రంలో కాంగ్రెస్ ఉనికి లేదు
- మీడియాతో మాజీ మంత్రి నాగం

నాగర్‌కర్నూల్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డికి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నదని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నాగర్‌కర్నూల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాగంతో కలిసి మీడియాతో మాట్లాడారు. 90 శాతం మంది నాయకులు నాగం వద్దే ఎదిగారని గుర్తు చేశా రు. అంతటి గొప్ప నాయకుడికి కాంగ్రెస్‌లో తీవ్ర అవమానం జరిగిందని చెప్పారు. రోజు కో పార్టీ మారే నాయకులకు టికెట్ ఇచ్చి ఆయనకు హస్తం పార్టీ నేతలు అన్యాయం చేశారని విమర్శించారు. నాగం మార్గదర్శకంలో పనిచేస్తామని స్పష్టం చేశారు. నెలరోజులపాటు కష్టపడి బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని కోరారు. అనంతరం నాగం మాట్లాడుతూ.. ఎన్నికల్లో మర్రి జనార్దన్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ 30 ఏండ్ల నుంచి ఉనికి కోల్పోయిందని విమర్శించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎన్ని మండలాలు, ఎన్ని గ్రామాలు ఉన్నాయి? ఎంత మంది ప్రజలు ఉన్నారు? ఎలాంటి సమస్యలు ఉన్నాయో ఏమీ తెలియని నేత ఎలా పోటీ చేస్తాడని ప్రశ్నించారు. మోసం చేసే కూచకుళ్లకు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

నేనలా మాట్లాడలేదు:దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్ నేత

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): మంథని బీఆర్ఎస్ నాయకుడు పుట్ట మధుకర్‌ను దూషించినట్టు గత నెల 20న పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ కాంగ్రెస్ నేత దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలోని మాటలు తనవి కావని, తప్పుడు వీడియో ఆధారంగా స్థానిక నేత ఆర్ రఘుప్రసాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారి దానిని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు తనపై కేసు నమోదు చేశారని తెలిపారు. మధుకర్‌పై తాను ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు.

దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో పింఛన్‌తో లబ్ధి పొందుతున్న కుటుంబ సభ్యులు

ఆ ఇంటికి కేసీఆరే 'ఆసరా'

- ముగ్గురికి కలిపి నెలకు రూ.10 వేల పింఛన్
- రైతుబంధు ద్వారా ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం

దేవరుప్పుల, నవంబర్ 2: ఆ ఇంటికి కేసీఆరే 'ఆసరా'గా నిలిచారు. ఇంట్లో ముగ్గురికి కలిపి నెలకు రూ.10 వేల పింఛన్ అందుతున్నది. ఉన్న రెండెకరాల భూమికి రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం కూడా అందుతున్నది. దీంతో ఆ కుటుంబం కేసీఆర్ ప్రభుత్వానికి విధేయతగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి చెందిన వారాల సోమలక్ష్మి భర్త 20 ఏండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమెకు ఉన్న ఒక్క కొడుకు వారాల మహేందర్ దివ్యాంగుడు. కొడుకును కష్టపడి సాదుకున్నది. కొడుకుకు దివ్యాంగురాలు నవనీతతో పెళ్లి చేసింది. వీరికి ఒక పాప ఉంది. ఉన్న రెండెకరాలు కష్టపడి సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం, కేసీఆర్ ప్రభుత్వం వచ్చి వీరి జీవితాలను మలుపు తిప్పింది. కేసీఆర్ ప్రవేశపెట్టిన ఆసరా పింఛన్లు ఆ కుటుంబానికి వరంగా మారాయి. తల్లి సోమలక్ష్మికి వృద్ధాప్య పింఛన్ రూ.2,016, భార్యాభర్తలైన దివ్యాంగులు మహేందర్, నవనీతకు చెరో రూ.4,016లు నెలనెలా ఆసరా పింఛన్లు వస్తున్నాయి. ఇక రైతుబంధు పేర సంవత్సరానికి రూ.20 వేల పెట్టుబడి సాయం ఆ ఇంటికి అందుతున్నది. దీంతో తాము ఎవరికీ చేయి చూపకుండా బతుకుతున్నామని, కేసీఆర్ తమ కుటుంబ సంరక్షకుడని వారు తెలిపారు. మళ్ల మళ్ల కేసీఆర్ సారే రావాలని ఆ కుటుంబం ముక్తకంఠంతో కోరుతున్నది.